క్లుప్తంగా

నేడు బ్రహ్మరథోత్సవం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం బ్రహ్మ రథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలకు పసుపు, కుంకుమ పంపిణీ

తంబళ్లపల్లె: మహాశివరాత్రి మల్లయ్యకొండకు వచ్చిన మహిళా భక్తులకు బుధవారం శివారెడ్డి టెక్స్‌టైల్స్ యజమాని పుల్లారెడ్డి , ఇందిరమ్మ, శకుంతలమ్మ దంపతులు సంప్రదాయబద్ధంగా పసుపు,కుంకుమ, పసుపుదారం, పూలు వితరణగా ఇచ్చారు. వారి దాతృత్వాన్ని మహిళా భక్తులు ప్రశంసించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె: బైక్ అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన తనకల్లు మండలంలో జరిగింది. కొక్కంటి క్రాస్ పెద్దపల్లికి చెందిన రమణ (55) ద్విచక్రవాహనంలో కొక్కంటి నుంచి పెద్దపల్లికి వస్తుండగా మార్గమధ్యంలో బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

'ఆప్కాస్ రద్దు విరమించుకోవాలి'

మదనపల్లె: ఆప్కాస్ రద్దు ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ మదనపల్లి మునిసిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు పంపారు. బుధవారం సీఐటీయూ జిల్లాకోశాధికారి హరిశర్మ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు వల్ల ప్రైవేటు ఏజెన్సీలకు కాంట్రాక్టర్లకే లాభం కలుగుతుందన్నారు. మున్సిపాలిటీలలో తక్కువ వేతనాలకు పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు చేస్తున్న దశలవారీ పోరాటం గుర్తించి , ప్రభుత్వం కళ్ళుతెరవాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. కార్మికులకు పెండింగులో ఉన్న ఈఎస్ఐ, పీఎఫ్, సమస్యలు పరిష్కరించాలని, పరికరాలు, యూనిఫాం, శానిటైజర్లు, గ్లౌజులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లి మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు చలపతినాయుడు, సాంబశివనాయక్, రాము,కృష్ణప్ప, గోపాల్,బాలకృష్ణ, చంద్ర, రాజు మునుస్వామి. నరసింహులు, అరవింద్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సయ్యద్‌షా మస్తాన్‌వల్లి దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ : స్థానిక కోటవీధిలోని సయ్యద్‌షా మస్తాన్‌వల్లి దర్గా ఉరుసు ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. దర్గాలోని మజార్లకు ప్రత్యేక పూలతో అలంకరించారు. కడపకు చెందిన హజరత్ ఖాజా సయ్యద్ అరిఫుల్లా ఫాతెహా నిర్వహించారు. హిందు, ముస్లిం సోదరులు దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు ఇర్ఫాన్‌ఖాన్, కార్యదర్శి యూసఫ్ షరీఫ్, కోశాధికారి ప్యారీజాన్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి కుంభాభిషేక మహోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 28వతేదీ నుంచి మహా కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పూనగంటి ఓంప్రకాష్ తెలిపారు. బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహా కుంభాభిషేక ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఆలయం పునః నిర్మాణం చేసి 12 వ సంవత్సరం పురస్కరించుకుని మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహోత్సవాలు మార్చి 2వతేదీ వరకు జరుగుతాయన్నారు. మొదటి రోజు కంచి కామకోటి పీఠాధిపతులైన జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ఆశీస్సులతో ప్రారంభమవుతుందన్నారు. మార్చి 2వతేదీ జరిగే కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మంత్రి టీజీ భరత్, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య యువజన సంఘ నాయకులు ఎల్లంపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

పెద్దతిప్పసముద్రం: మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని కమ్మచెరువులో క్రికెట్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలో గెలుపొందిన జట్టుకు సర్పంచ్ చెరువు నరసమ్మ మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.5 వేల నగదు అందజేశారు.

హర హర..శంభో శంకర

- మార్మోగిన శివనామస్మరణ
- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు



మదనపల్లె: యోగభోగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులు



తంబళ్లపల్లె: విద్యుత్ దీపాలంకరణలో మల్లయ్యకొండ ఆలయం

మదనపల్లె సిటీ: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నియోజకవర్గంలోని శివాలయాలు బుధవారం శివనామస్మరణలతో మార్మోగిపోయాయి. ఆలయాలు వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. మదనపల్లె పట్టణం దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి నాలుగు యామాలు పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ మహన్యాస రుద్రాభిషేకం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ ఉదయం మహన్యాసక పూర్వ ఏకదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఆలయం ఆవరణంలో శివపార్వతుల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి పుష్పపల్లకి చేశారు. ఈశ్వరట్రస్టు అధినేత ఈశ్వర్‌రెడ్డి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, సిబ్బంది అంకన్న,రాజశేఖర్ పాల్గొన్నారు. సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయంలలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నీరుగట్టువారిపల్లెలో సిద్దేశ్వర ఆలయం, అనంతయ్యబంగ్లావీధిలో పంచలింగాల మల్లికార్జునస్వామికి భక్తులే స్వయంగా అభిషేకాలు చేశారు. శివనగర్‌లో శ్రీ సిద్దవైద్యలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

మదనపల్లె రూరల్‌లో..

మండలంలోని సీటీఎంలోని గెవిగుండులో వెలసిన గంగాధరస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు కుమారస్వామి ప్రత్యేక పూజలు చేశారు. వేంపల్లె మల్లయ్యకొండ ఆలయంలో పూజలు చేశారు.

ప్రత్యేక పూజలు

స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వర స్వామి ఆలయంలో స్వామిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ స్వామిని దర్శించుకున్నారు. శివరాత్రి పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు విశ్వేశ్వరప్రసాద్, మురళి స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

మారుమోగిన శివాలయాలు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ, ఎగువబురుజుపల్లె, సరిమడుగు, ప్యారంపల్లె గ్రామాల్లో శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. బుధవారం మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. వేకువ జామున 5 గంటల నుంచే ఆలయాల్లో భక్తుల సందడి మొదలైంది. ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుర్రంకొండ, సరిమడుగు గ్రామాల్లోని శ్రీ సిద్ధమల్లేశ్వర స్వామి ఆలయాల్లో ఏక రుద్రాభిషేకం కావించారు. సరిమడుగు శివాలయంలో స్వామివార్లకు రంగ రంగ వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు.

కలికిరిలో..

కలికిరి: కలికిరి పట్టణంలో వెలసిన శ్రీసోమేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది. రాత్రి ఆలయ ఆవరణలో శివపార్వతుల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. మేడికుర్తి బాహుదానది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు హరి స్వామి ఉదయం నుంచి స్వామి వారికి అర్చన, అభిషేకం, విశేష అలంకరణ చేశారు. పూలకొండలో వెలసిన మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు.

పీలేరులో..

పీలేరు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివనామస్మరణతో భక్తులు ఆది దంపతులను దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారిజామున 3 గంటల నుంచే మహా శివరాత్రి ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు, అభిషేకాలతో ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. పీలేరు పట్టణం సదుం మార్గంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, శివపార్వతులకు ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతి, నగర సంకీర్తన, సాయంత్రం అత్యంత వైభవంగా గిరిజా కళ్యాణం, రాత్రి లింగోద్భవ సమయంలో హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివునికి 108 లీటర్లతో పాలాభిషేకం చేశారు.

భక్తులతో కిటకిటలాడిన మద్దుండాల మల్లేశ్వరస్వామి

పీలేరు రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తలపుల పంచాయతీల అడవిపల్లె వద్ద వెలసిన శ్రీ మద్దుండాల మల్లేశ్వస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఝరిస్నానాలు, సిద్ధపూజ, మొక్కుబడులు, వరపడుట, నాణెలు, దేవరెద్దులు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు మురళీనాయుడుతెలిపారు.

అంతటా శివనామ స్మరణ

బి.కొత్తకోట: శివరాత్రి పర్వదినాన శైవాలయాల్లో భక్తుల నోట శివనామ స్మరణ మార్మోగింది. బుధవారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. స్థానిక చౌళేశ్వరస్వామి, ఆకులవారిపల్లిలోని పూతపలేశ్వరస్వామి, బీరంగి గ్రామం బండెన్నస్వామి ఆలయం ప్రాంగణంలోని స్పటికలింగ శివాలయంలో భక్తులు దర్శించుకున్నారు. పూతపలేశ్వర స్వామి ఆలయంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి దంపతులు కళ్యాణోత్సవ వేడుకలో పాల్గొన్నారు. బండెన్నస్వామి ఆలయంలో శివపార్వతుల వెండి ఉత్సవ విగ్రహాలకు పండితులు కళ్యాణోత్సవ వేడుక నిర్వహించగా పీఠాధిపతి పగడాల లక్ష్మీపతిస్వామి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం మండలంలోని ఆలయాలు శివనామ స్మరణలతో మార్మోగాయి. భక్తులు వేకువ జాము నుంచే ఆలయాలకు క్యూ కట్టారు. వేద పండితులు, ఆలయాల సేవకులు అభిషేకాలు, హోమాలు, కళ్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

హర హర మహాదేవ

కురబలకోట: శివరాత్రి సందర్భంగా అంగళ్లు మల్లయ్య కొండపై భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ప్రత్యేక ఏర్పాట్లు గావించారు. అన్నదానం పెద్ద ఎత్తున నిర్వహించారు. టిడిపి నాయకుడు దాసరపల్లె జయచంద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపై రాత్రి భరత నాట్యం ఆకట్టుకుంది. జాగారం భక్తుల కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మదనపల్లె కౌన్సిలర్ సరిత గంగాధర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్‌వెలుగుల్లో మల్లయ్యకొండ

తంబళ్లపల్లె: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబసమేత మల్లికార్జునస్వామి విద్యుత్‌దీపాలతో స్వరాంగసుందరంగా అలంకరించారు. దాత నల్లగుండ్ల మల్లికార్జున రెడ్డి సుమారు రూ.4లక్షల ఖర్చులతో ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేయించారు. ఆయన దాతృత్వాన్ని భక్తులు అభినందించారు.

అన్నదాన ఏర్పాట్లు అమోఘం

తంబళ్లపల్లె సమీపంలో వెలసిన శ్రీభ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కొండకు వచ్చే భక్తులకు శ్రీ మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ (ట్రస్టు) సభ్యులు అన్నదాన ఏర్పాట్లు అమోఘంగా చేశారని మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి అన్నారు. లక్షలాది మంది భక్తులకు రుచికరమైన వంటకాలు చేశారు. అన్నదాన ట్రస్టుకు దాతలు ఆర్థిక సహాయం అందించారు.

నేలమల్లేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిమ్మనపల్లె : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శ్రీ నేల మల్లేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మండలం లోని అగ్రహారం పంచాయతీ పూలవండ్ల పల్లె, రెడ్డివారిపల్లె సోమేశ్వరాలయల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. శివనామ స్మరణలతో ఆలయాలు మారుమోగాయి. ఆలయాలను వివిధ రకాల పుష్పాలు,విద్యుత్ దీపాలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు . రాత్రి ప్రజలు జాగరణ చేశారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండలంలోని శివాలయాలు బుధవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని శ్రీ వాలీశ్వర స్వామి, శ్రీ చంద్ర శేఖర స్వామి, మూగవాడిలోని పార్వతి సమేత శ్రీ పుండరీశ్వర స్వామి, అర్. నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీ వాలీశ్వర స్వామి ఆలయం, గుంతయంబాడీ లోని శ్రీ పుండరీశ్వర స్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. శివనామ స్మరణలతో ఆలయాలు మారుమోగాయి. ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో అందంగా తీర్చిదిద్దారు. ఆలయాలు విద్యుత్ దీపాలంకరణలతో పలువురిని ఆకట్టుకున్నాయి.

ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

కేవీపల్లె : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని గోరంట్లపల్లె పంచాయతీ జంగంపల్లెలో వెలసిన శ్రీ భ్రమరాంభిక సమేత శ్రీ మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలమూర్తులకు రుద్రాభిషేకము, సహస్ర లింగార్చన చేపట్టారు. అలాగే వేదపారాయణము, గణపతి హోమము, రుద్రహోమము, మృత్యుంజయ హోమం, లఘు పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరవిందో ఫార్మసీ అధినేత నిత్యానందరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సాయంత్రం కన్నుల పండువగా కల్యాణోత్సవం, లింగోద్భవ కార్యక్రమం నిర్వహించారు.



మదనపల్లె: పూజల్లో నిస్సార్‌అహ్మద్



ఆలయం వద్ద దర్శనం కోసం భక్తులు



గుర్రంకొండ: సిద్ధమల్లేశ్వర స్వామికి పూజలు



కలికిరి: శివపార్వతుల కల్యాణం



పీలేరులో దర్శనమిస్తున్న కాశీవిశ్వేశ్వరస్వామి



కేవీపల్లె : హోమం నిర్వహిస్తున్న అర్చకులు



అంగళ్లు మల్లయ్య కొండపై భక్తుల కోలాహలం



పెద్దతిప్పసముద్రంలో శివ పార్వతుల కల్యాణం



బి.కొత్తకోట: కలశాలతో సురేష్‌రెడ్డి దంపతులు



పీలేరు: శివపార్వతుల ఊరేగింపు

జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేక కుట్రలు

- 45 శాతం ఓట్లు వచ్చిన ప్రతిపక్ష హోదా ఇవ్వరా?
- జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వస్తే కూటమి ఆటలు చెల్లవు
- ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే ప్రజాక్షేత్రంలో ఎండగడతాం
- సమన్వయకర్త నిసార్ అహ్మద్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గం సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె: శాసనసభలో వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ము లేకనే కూటమి ప్రభుత్వం వైఎస్సార్సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా కుట్రలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజకవర్గం సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్ సీపీకి ఎందుకు ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 2024 శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 3.38 కోట్ల ఓట్లు పోలయ్యాయి అన్నారు. అందులో టీడీపీకి 1.53 కోట్లు, వైఎస్ఆర్సీపీకి 1.32 కోట్లు, జనసేనకు 23 లక్షలు బీజేపీకి 9 లక్షల ఓట్లు వచ్చాయన్నారు. టీడీపీకి వైఎస్ఆర్సీపీకి మధ్య ఉన్న ఓట్ల తేడా కేవలం 21 లక్షలు మాత్రమే అన్నారు. కేవలం ఎమ్మెల్యే స్థానాల సంఖ్య ఆధారంగా ప్రతిపక్ష హోదా ఇవ్వమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పది శాతం కంటే తక్కువ ఎమ్మెల్యే స్థానాలు వస్తే ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. ఇలాంటి నియమం కేవలం రాజకీయ అవసరాల కోసం వాడుతూ, ప్రతిపక్షం గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. 2015 ఢిల్లీ ఎన్నికలలో 70 స్థానాలకు గాను 67 స్థానాలు ఆప్ పార్టీ గెలుచుకోగా బీజేపీకి కేవలం మూడు స్థానాలు మాత్రమే వచ్చాయన్నారు. అయినా బీజేపీకి అప్పటి ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రతిపక్ష హోదా ఇచ్చారన్నారు. 1984 లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 400 స్థానాలను గెలుచుకోగా టీడీపీ 30 స్థానాలకు పరిమితమైందన్నారు. 10 శాతం కంటే తక్కువ స్థానాలు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం టీడీపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 294 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ కేవలం 26 స్థానాలు సాధించినా అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని చూస్తుంటే వైఎస్ఆర్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వనని చెప్పడంలో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అన్నారు. కేవలం ఎమ్మెల్యే సీట్ల సంఖ్యను సాకుగా చూపించి శాసనసభలో ప్రతిపక్షం గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. ప్రతిపక్షం లేకపోతే తమ ఇష్టానుసారంగా బిల్లులు పాస్ చేసుకోవచ్చని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ప్రజాభిప్రాయానికి విలువ ఇవ్వకుండా సొంత ప్రయోజనాల కోసం వైఎస్ఆర్ సీపీకి ప్రతిపక్ష హోదా నిరాకరిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీలో అడుగుపడితే కూటమి ప్రభుత్వం ఆటలు సాగవని, అందుకే దొడ్డిదారిన ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ఇవ్వకపోయినా ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు. కార్యక్రమంలో యకులు మహేష్,మల్లికార్జున రెడ్డి, మేరీ, శారద రెడ్డి, విమలమ్మ, జయమ్మ, సాదిక్, యూనస్,వైజయంతి, నాగమణి పాల్గొన్నారు.

వంకలు, వాగులను కాపాడాలి

-ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె: మదనపల్లి రూరల్ తట్టివారిపల్లి పంచాయతీలో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలను అడ్డుకోబోయిన రెవెన్యూ అధికారులపై భూ ఆక్రమణ దారులు రెవెన్యూ అధికారులపై దాడి చేయడాన్ని ఏఐటీయూసీ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ అధికారులపై దాడి చేసిన భూ ఆక్రమణ దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో కఠినంగా శిక్షలు పడేలా పోలీసులు చూడాలని కోరారు. మదనపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లో గుట్టలు, వాగులు,వంకలు కొంత మంది అవినీతి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆక్రమణలకు గురై తున్నాయన తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణ చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టేవరకు సంబంధిత కింది స్థాయి రెవెన్యూ అధికారులు ఎందుకు అటువైపు పోలేదని ఆయన ప్రశ్నించారు. సామాన్య రైతుకు 1బి,ప్రాణం లాంటిది అలాంటి 1బి ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు సవాలక్ష కారణాలు చెప్పే అధికారులు లక్షలాది రూపాయలు విలువ చేసే భూమిలో భవణాలు నిర్మాణం జరిగేవరకు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు

పోలీసులు భూ ఆక్రమణ దారులపై కఠినంగా హెచ్చరిస్తున్నా కబ్జాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా రెవెన్యూ అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, విలువైన ప్రభుత్వ భూములను ప్రజా భవిష్యత్తు అవసరాల కోసం కాపాడాలని కోరారు

మల్లికార్జునుడి ఆశీస్సులతో సమగ్ర అభివృద్ధి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి
- ఆలయానికి రూ.4.60 లక్షల విరాళం



మల్లికార్జునుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆశీస్సులతోనే తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయగలిగామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ఆయన తంబళ్లపల్లి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు ఉదయం ఏడు గంటలకు కొండకింద నుంచి కాలినడక 10 కిలోమీటర్లు నడిచి కొండపైకి చేరుకున్నారు. నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో వెంట తరలివచ్చారు. ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలతో ఆశీర్వచనం అందించారు. అక్కడినుంచి తిరిగి 10 కిలోమీటర్లు కాలినడక కొండకిందకు చేరుకున్నారు. మల్లయ్యకొండను అభివృద్ధి చేసి భక్తులకు ఇబ్బందులు తొలగించారని, ఆలయం ఏర్పడినప్పటి నుంచి రహదారి సౌకర్యం లేకపోగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తారురోడ్డు నిర్మించి భక్తుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్యేను భక్తులు ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం అన్నదాన ట్రస్ట్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే ఆలయానికి తన సొంత నిధులు రూ.2.60 లక్షల విరాళం అందించారు. ఎంపీ మిథున్‌రెడ్డి రూ.2 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019–24 మధ్య జరిగిన అభివృద్ధి నియోజకవర్గ ప్రజల మనస్సుల్లో నిలిచిపోతుందన్నారు. మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయజీర్ణోద్ధరణ కు రూ.3.15 కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేయించామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మల్లయ్య కొండకు రూ.6.75 కోట్లతో తారురోడ్డు నిర్మించామన్నారు. పలు ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు రూ.2 కోట్లు మంజూరు చేయించామన్నారు. అభివృద్ధిలో రాష్ట్రంలోనే తంబళ్లపల్లికి ప్రత్యేక స్థానం దక్కిందన్నారు. కురబలకోట మండలం ముదివేడు వద్ద రూ.775 కోట్లతో రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టగా టీడీపీ నేతలు అడ్డంకులు సృష్టించి ఎన్‌జీటీ కేసుతో పనులు నిలిపివేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పనులు పూర్తయివుంటే కృష్ణా జలాలతో నింపేవాళ్లమని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీఆర్.ఉమాపతి, ఆలయ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి, ఎంపీపీలు అనసూయమ్మ, గుర్రం పూర్ణచంద్రిక, మొహమూద్, ఉమామహేశ్వరీ, జెడ్పీటీసీ బైసాని జ్యోతి, మండల కన్వీనర్లు చౌడేశ్వర, రెడెప్పరెడ్డి, సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, మైనుద్దీన్, ఉపసర్పంచు టీ.మధు, టీఏసీ సభ్యుడు ముత్రదామోదర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



శివాలయంలో పూజలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వాల్మీకిపురం పట్టణ పరిధిలోని కోనేటివీధిలో గల శివాలయంలో బుధవారం ఆయన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలని, ఆధ్యాతికతతో ప్రశాంత జీవనం సాధ్యమవుతుందన్నారు.

అడవికి నిప్పు పెట్టొద్దు

– డిప్యూటీ ఆర్ఓఐ మదన్ మోహన్



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

నిమ్మనపల్లె: అడవికి నిప్పు పెట్టి మూగజీవాల ప్రాణాలకు ముప్పు తేవద్దని అటవీ శాఖ మదనపల్లి డిప్యూటీ ఆర్ఓఐ మదన్ మోహన్ అన్నారు. బుధవారం తవళం అటవీశాఖ బీటు పరిధిలో ఎఫ్‌బీఓలు దీప, త్యాగరాజులతో కలిసి అడవికి నిప్పు పెట్టడం వలన కలిగే అనర్థాలను వివరించారు. అటవీ ప్రాంతంలోని నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తులకు అవగాహన కల్పించారు. నిప్పు పెట్టడం వల్ల అరుదైన వన్య ప్రాణులు, మూగజీవాలు చనిపోతాయన్నారు . అడవిలో పచ్చదనం లేకపోవడంతో వాతావరణ మార్పుల వల్ల , సకాలంలో వర్షాలు కూడా రావన్నారు. వృక్ష సంపదను కాపాడుకోవడం, వన్యప్రాణులు, మూగజీవాలను సంరక్షించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. ప్రజలు అడవుల ప్రాముఖ్యతను తెలుసుకొని వాటిని అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ బి ఓ లు దీప, త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.